క్లుప్తంగా

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ



వరుడి కుటుంబ సభ్యులకు పెళ్లికానుకను అందజేస్తున్న నాయకులు

చంద్రగిరి: ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందజేసిన ఎమ్మెల్యే వివాహ కానుకను వైఎస్ ఆర్ సీపీ నాయకులు వరుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆదివారం మండల పరిధిలోని పనపాకం పంచాయతీ బోడిగుట్టవారిపల్లికి చెందిన మోహన్, సునీతలకు వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ వెంకటరత్నం నాయకులతో కలసి నూతన వధూవరులకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపించిన బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, భాసికాలు, మహార్ఘపు పట్టు వస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, అమ్మవారి పసుపు–కుంకుమతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పంచాయతీ అధ్యక్షుడు పానేటి చెంగల్రాయులు, నాయకులు రెడ్డెప్ప, కసా గోపాల్, నాగభూషణం, భాస్కర్, అజయ్ కుమార్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా తిరుపతి గంగమ్మకు పూజలు



విశేషాలంకరణలో తిరుపతి గంగమ్మ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపైన వెలసిన తిరుపతి గంగమ్మకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శనివారం చంద్ర గ్రహణం సందర్భంగా ఆలయం మూసివేశారు. ఆదివారం ఉదయం ఆలయంను శుద్ధిచేసి అమ్మవారికి అభిషేకం, అర్చనలు చేపట్టి, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

సర్వీస్ రూల్స్ రూపొందించండి



వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: ప్రభుత్వంలో విలీనమై రెండేళ్లు గడిచినా ఇంత వరకు తమకు సర్వీస్ నిబంధనలు రూపొందించలేదని, సర్వీస్ రూల్స్‌ను రూపొందించి ఆదుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగ సంఘం నేతలు ఆదివారం ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కల్పలతారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు ఎస్వీ యూనివర్సిటీలో వారిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, డాక్టర్ జలగం రామాంజులు, సురేంద్ర, సావిత్రీబాయి, శ్రీనివాసులు, డాక్టర్ సుప్రజా రాణి పాల్గొన్నారు.

నేడు ఖాదీ ఫెస్ట్ ప్రారంభం



మాట్లాడుతున్న ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ సీఈవో విజయ రాఘవనాయక్

తిరుపతి కల్చరల్: దేశవ్యాప్తంగా ఖాదీ ఉత్పత్తులను పెంచాలనే లక్ష్యంతో ఖాదీ వారోత్సవాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాలని కేంద్రం ఇచ్చిన ఆదేశాల మేరకు సోమవారం తిరుపతిలోని పాత వెంకటేశ్వర థియేటర్ (ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్)లో ఖాదీ ఫెస్ట్ ప్రారంభిస్తున్నట్లు ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ సీఈవో వీఆర్ విజయరాఘవ నాయక్ తెలిపారు. ఈ ఖాదీ ఫెస్ట్‌ను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేతుల మీదగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 30 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు ఈ ఖాదీ ఫెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. ఖాదీ విలేజ్ కమిషన్ బోర్డు కమిషనర్ కోటిరెడ్డి, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ఉమ్మడి చిత్తూరు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రామ్, డెప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు, ఆర్ఎల్ఎన్.మూర్తి, రవి కుమార్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు స్త్రీ శక్తి భవన్‌లో జరుగుతుందని ఎంపీడీవో దేవేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి పథంలో ఆనందగిరి

- దినదినాభివృద్ధి చెందుతున్న సుబ్రమణ్యస్వామి దేవస్థానం
- రహదారి ఏర్పాటు, భవనాల నిర్మాణం

మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీ ఊట్లవారిపల్లి గ్రామానికి సమీపంలోని ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవస్థానం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. సుందరమైన ప్రకృతిలో, పచ్చని చెట్ల మధ్యన భక్తానుగ్రహ కారకుడు, మహదానంద ప్రదాయకుడు పాళ్యంకొండ స్కంధమలై అనే ఆనందగిరిపై శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామివారు కొలువై ఉన్నారు. ప్రతీ ఏటా ఇక్కడ జరిగే బ్రహ్మోత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో స్వామివారి దేవస్థానంలో అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయి.

పాకాల: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కొలువైన ప్రాంతం పూర్వం పల్లవ రాజుల ఏలుబడిలో ఉండేది. అందుకే ఈ ప్రాంతానికి పాళ్యం కొండగా పేరు పొందింది. ఈ కొండపై సిద్ధాచారి అనే భక్తుడు ఓ పెద్ద బండ రాతి కింద కూర్చుని ఈశ్వర ధ్యానం చేయగా ఆ దంపతులకు కుమారుడు జన్మించాడు. అతనికి పాలవరాయుడు అని పేరు పెట్టారు. పాలవరాయుడికి 11 సంవత్సరాలు వయస్సు ఉన్నప్పుడు సిద్ధాచారి దంపతులు గతించారు. పాలవరాయుడు దుఃఖంలో ఉండి ప్రతీ రోజు సుబ్రమణ్యస్వామిని ధ్యానిస్తూ దుంపలు, పండ్లు తింటూ జీవనాన్ని సాగిస్తూ వచ్చాడు. పాలవరాయుడు 80 సంవత్సరాల వయస్సులో ఘోర తపస్సును ఆచరించాడు. అతని తపస్సుకు మెచ్చి సుబ్రమణ్యస్వామి దర్శన భాగ్యం కల్పించాడు. ఉభయ దేవేరులతో ఇక్కడే వెలసి ఉండాలని స్వామివారిని కోరాడు. కొంత కాలం తరువాత పాకాలకు చెందిన మేలిపాటి మునస్వామి ఆచారి అనే స్వర్ణకారుడు బంగారు వ్యాపారం చేస్తూ జీవించేవాడు. అతనికి సుబ్రమణ్యస్వామిపై ఎనలేని భక్తి, అతనికి ఒక రోజు తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. చాలా రోజులు కడుపునొప్పి తగ్గలేదు. ఒక రోజు సుబ్రమణ్యస్వామి తనకు కలలో కనిపించి పాళ్యం కొండపై గల దోనెలో ఉన్న తీర్థాన్ని తాగితే కడుపునొప్పి తగ్గిపోయి ఉపశమనం పొందుతావని చెప్పారు. ఆ తరువాత పాళ్యం కొండకు చేరుకుని ఆ దోనెలోని నీటిని తాగడంతో మునస్వామి ఆచారికి కడుపునొప్పి నుంచి ఉపశమనం లభించింది. ఆ తరువాత ఈ విషయాన్ని చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు తెలిపి వారి సహకారంతో అక్కడ దేవస్థానం నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అయితే దేవస్థానం నిర్మించదలచిన ప్రదేశానికి వెళ్లేందుకు ఒక పెద్ద రాతిగుండు అడ్డుగా ఉంది. అప్పుడు మునస్వామి ఆచారి సుబ్రమణ్యస్వామిని భక్తి శ్రద్ధలతో వేడుకొనగా అదే రోజు భీకరమైన వర్షం కురిసి ఆ రాతి గుండుపై పిడుగు పడి రెండుగా చీలి దేవస్థానం నిర్మించదలచిన ప్రదేశానికి దారి ఏర్పడిందని చరిత్ర చెబుతోంది.

దినదినాభివృద్ధి

చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహాయ సహకారాల సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద దినదినాభివృద్ధి చెందుతోంది. రూ.36 లక్షల వ్యయంతో 300 మందికి సరిపడా జగనన్న సమావేశ మందిరం, రూ.6 లక్షలతో ప్రసాదాలు తయారీ గది(పోటు), రూ.2,25,000 వ్యయంతో ప్రదక్షిణ చేయుటకు ప్రహరీగోడ నిర్మాణం, రూ.20 లక్షల వ్యయంతో లింకు రోడ్డు నిర్మాణం, రూ.18 లక్షల వ్యయంతో కల్యాణకట్ట ఏర్పాటు, రూ. 35 లక్షల అంచనాతో 54 అడుగుల భారీ సుబ్రమణ్యస్వామి విగ్రహ నిర్మాణాన్ని చేపట్టారు. సుమారుగా రూ.7 లక్షల వ్యయంతో ఊట్లవారిపల్లి నుంచి ఆలయం వద్దకు కొత్త విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేపట్టారు. దేవస్థానం నిధులు రూ.2 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం రూ.12 లక్షల వ్యయంతో పురుషులకు, మహిళలకు వేర్వేరుగా వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించారు. రూ.20 లక్షల వ్యయంతో పాకాల–చిత్తూరు మార్గంలోని రైల్వే గేటు నుంచి సుబ్రమణ్యస్వామి ఆలయానికి కొత్తగా మెటల్ రోడ్డుని నిర్మించారు.

స్వామివారి సేవలు, ఊరేగింపులు

ఆలయ నిర్మాణం ప్రారంభం నుంచి ప్రతీ ఏడాది ఆడికృత్తిక సందర్భంగా దేవస్థానంలో 5 రోజులు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ బ్రహ్మోత్సవాల్లో మూషిక వాహనంపై వినాయక స్వామిని, నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరులను, నెమలి వాహనంపై సుబ్రమణ్యస్వామిని ఊరేగిస్తారు. అలాగే పుష్పపల్లకి సేవ అలాగే కంకణ విసర్జన, ధ్వజావరోహణం, పాన్పుసేవ, అక్కగార్ల పూజ, కలశ స్థాపన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు.



నూతనంగా నిర్మించిన మెటల్ రోడ్డు





నూతనంగా నిర్మించిన వాహన మండపం, వ్యక్తిగత మరుగుదొడ్లు



నూతనంగా నిర్మించిన 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహం

ప్రతీ రోజూ ప్రత్యేక పూజలు

ఆలయ అర్చకులు ప్రతీ రోజు స్వామి, అమ్మవార్లను రకరకాల పూలతో అలంకరించి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులకు ప్రతీ రోజు దర్శన సౌకర్యం ఉంటుంది. ముఖ్యంగా మంగళవారం, శుక్రవారం రోజుల్లో స్వామివారికి అభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. పసుపు, కుంకుమ, గంధం, విభూది, పాలాభిషేకం, నెయ్యాభిషేకం, పెరుగు, నారికేళం, పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించి, అర్చనలు చేసి స్వామివారి నిజరూప దర్శన భాగ్యం కల్పిస్తారు. గతంలో ఈ అవకాశం ఒక్క సమయంలో మాత్రమే ఉండేది. ఈ ఏడాది నుంచి భక్తుల సంఖ్య పెరగడంతో వారి సౌకర్యార్థం రెండు, మూడు బ్యాచ్‌లుగా విభజించి అభిషేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆలయంలో ప్రతీ 3 నెలలకు ఒక్కసారి హుండీలను లెక్కిస్తారు. అత్యధికంగా ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబర్‌లలో 3 నెలలకు హుండీ లెక్కింపుల్లో రూ.4,40,900 ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

సుబ్రమణ్యస్వామి విగ్రహావిష్కరణ కుంభాభిషేకం

ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహాన్ని నవంబర్ 1వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కుంభాభిషేకం కార్యక్రమాన్ని 3 రోజులు నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కుంభాభిషేకంలో భాగంగా సోమవారం (30–10–2023) ఉదయం 9 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, సాయంత్రం వాస్తు హోమం, గంగపూజ, మృత్సంగ్రహణ, అంకురార్పణ, అఖండ స్థాపన, వరుణ ఆవాహన కలశ స్థాపన, తీర్థప్రసాద వితరణ, మంగళవారం ఉదయం 8.30 గంటలకు వేదపారాయణ, ప్రాతఃకాలపూజ, ఆవాహిదేవతా హోమములు, సాయంత్రం వేదపారాయణ, దీక్షాహోమం, పునఃపూజా, తీర్థప్రసాద వితరణ, బుధవారం(01–11–2023) ఉదయం 7 గంటలకు వేదపారాయణ, ప్రాతఃకాల అర్చన, నాడీసంధాన బింబ కళాహోమాదులు, ఉదయం 9 గంటలకు మహాపూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చేతులు మీదుగా విగ్రహావిష్కరణ

చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన సుబ్రమణ్యస్వామి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కుంభాభిషేకం సందర్భంగా ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

అభివృద్ధిలో పాలు పంచుకోవడం సంతోషకరం



ఆలయ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి ప్రతీ రోజు ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించాను. దీనికి తోడు చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారం అందడంతో అనేక అభివృద్ధి పనులు చేయగలిగాం. దేవుడి సన్నిధిలో ఉంటూ దేవస్థానాన్ని అభివృద్ధి చేయడంలో భాగస్వామ్యం కావడం స్వామివారి కృపగా భావిస్తున్నాను.

–మహాసముద్రం పట్టాభిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

వైఎస్ఆర్ సీపీ నాయకుడికి పితృవియోగం



నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

పాకాల: వైఎస్ఆర్ సీపీ నాయకుడు కాముడు తండ్రి బాలరాజు(60) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి మృతుని నివాసానికి చేరుకున్నారు. బాలరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ అన్ని సమయాల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చి, ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, సుధాకర్, శేఖర్, నిత్యానందం, సెంథిల్, హరీష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



నృత్యాలతో ప్రేక్షకులను అలరిస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. తిరుపతికి చెందిన పుష్ప బృందం ఆధ్వర్యంలో కళాకారులు చిన్నారులు భరతనాట్యం ప్రదర్శించారు. ఇందులో భాగంగా పుష్పాంజలి, అయిగిరి నందిని, ముద్దుగారే యశోద, మళ్లారి కీర్తన, ఒకపరి ఒకపరి వయ్యారి, కోయిలారే మామ కోయిలారే, జయకృష్ణ ముకుందా, శంభో స్వయంభో హరహర వంటి పాటలకు కళాకారులు రిత్విక, సహస్ర, లాస్య, ప్రత్యూష, ప్రియ, నీతిక, అనన్య, విహాన్యల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నత్యాలను ప్రదర్శించడంతో ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారికి అభినందనలు తెలిపారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

సీఐని దూషించిన సుధీర్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి

- ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘ నేతలు డిమాండ్



మాట్లాడుతున్న అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తి నియోజవర్గం ఏర్పేడు సీఐ అజయ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి దూషించిన శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి మాట్లాడారు. శ్రీకాళహస్తి రూరల్ ప్రాంతం కమ్మ కొత్తూరులో బొజ్జల సుధీర్‌రెడ్డి జగనాసురవధ కార్యక్రమాన్ని చేపడుతుంటే నివారించి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సమగ్ర విషయాల్ని తెలపాలని ఓ పోలీసు అధికారిగా సీఐ అజయ్‌కుమార్ సూచించారన్నారు. దీనిని సహించలేని సుధీర్‌రెడ్డి ఫోన్ ద్వారా సీఐని దుర్భాషలాడుతూ హెచ్చరికలతో భయాందోళనకు గురి చేయడం దారుణమన్నారు. దళిత సీఐను చులకన భావనతో దూషించిన ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే అంబేడ్కర్ సంఘం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘ నేతలు రామాంజనేయులు, కుమార్, సెల్వకుమార్, మధు పాల్గొన్నారు.

ప్రవచనం కాదు.. ప్రజావచనం కావాలి

- వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభసభలో వక్తల పిలుపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: ప్రవచనాలు చెప్పే వారు చాలా మంది ఉన్నారు... అయితే నేటి సమాజానికి ప్రజా వచనం చెప్పేవారు కావాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. యశోదనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వేమన విజ్ఞాన కేంద్ర భవనాన్ని ఆదివారం ప్రముఖ పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి ప్రారంభించారు. చిత్తూరు జిల్లా కమ్యూనిస్టు నేత పలవలి రామకృష్ణారెడ్డి పేరిట ఏర్పాటు చసిన సభా మందిరాన్ని ఆయన కుమార్తె , మాజీ వీసీ ఆచార్య కుసుమ కుమారి, ప్రముఖ అనువాదకుడు ఏజీ యతిరాజులు పేరిట నిర్మించిన సభా మందిరాన్ని ఆయన సతీమణి ఏజీ చంద్రమ్మ ప్రారంభించారు. దీనికి ముందు టీటీడీ పరిపాలనా భవనం నుంచి పెద్ద ఎత్తున వందలాది మంది విద్యార్థులు, సాహితీవేత్తలతో వేమన విజ్ఞాన కేంద్ర కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథి తెలకపల్లి రవి మాట్లాడుతూ సమాజానికి హేతుబద్ధ ప్రశ్నను నేరిపించిన కవి వేమన అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కళలకు, కళాసాహిత్యానికి కేంద్రంగా ఈ సంస్థ పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. వేమన తిరుపతి బాల భవన్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకం అలరింపజేసింది. మాజీ వీసీ కుసుమకుమారి, ఏజీ అరవింద్, సీనియర్ నటుడు కాకరాల, రాయలసీమ సాహితీవేత్త భూమన్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ లింగుట్ల రమేష్‌నాథ్, తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టింకాల దామోదరం, తిరుపతి జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు కేవీ చౌదరి, రచయిత్రి కొలకలూరి మధుజ్యోతి, కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత పల్లెపట్టు నాగరాజు, విజ్ఞాన కేంద్రాల కో ఆర్డినేటర్ పిన్నమనేని మురళీకృష్ణ, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుతున్న గుజిరీ వ్యాపారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా నేత రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్: నగర ప్రజలు, కంపెనీలు, షాపులు వాడేసిన ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్, వాటర్ బాటిల్స్ వంటి అనేక రకాల వస్తువులను సమీకరించి రీసైక్లింగ్ చేస్తూ పర్యావరణానికి గుజిరి వ్యాపారులు మేలు చేస్తున్నారని, వారిపై అధికారులు దాడులు చేయడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ తెలిపారు. ఆదివారం గంధమనేని శివయ్య భవన్‌లో తిరుపతి నగర గుజిరి వ్యాపారుల సంఘం మహాసభ నిర్వహించారు. పాడైపోయిన సామగ్రిని గుర్తించి వ్యాపారానికి కావాల్సిన షెడ్లు నిర్మించి గుజిరీ కార్మికులు, వ్యాపారులను ఆదుకోవాలని తెలిపారు. ఏఐటీయూసీ నగరప్రధాన కార్యదర్శి ఎన్‌డీ.రవి, చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్.శివకుమార్, గుజిరి వ్యాపారుల సంఘం నగర ప్రధాన కార్యదర్శి అల్లబక్షు, దాము, ఆలీబాషా, అజీమ్, పళని, రాధాలత, బాలన్, మహబూబ్ బాషా, కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీ ముసుగులో టీడీపీ కోసం పనిచేస్తున్నారు

తిరుపతి మంగళం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కుల పిచ్చితో మాట్లాడుతూ బీజేపీ ముసుగులో తెలుగుదేశం పార్టీ కోసం పనిచేస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం అయన తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై పురంధేశ్వరి దుష్ప్రచారం మానుకోవాలన్నారు. చంద్రబాబు నాయుడు ఆనాడు లిక్కర్ విషయంలో వారు కొందరికే అనుకూలంగా పనిచేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం హయాంలో మొత్తం అన్ని కంపెనీలకు కూడా తగిన విధంగా ఆర్డర్లు ఇస్తున్నారని, అత్యంత పారదర్శకంగా లిక్కర్ విధానాన్ని పాటిస్తున్నారని చెప్పారు. ఎంపీ మిథున్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు.

వారపు సంతలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి: వారపు సంతలో వ్యాపారాలు చేసుకునే రైతన్నలకు, వ్యాపారులకు తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 నుంచి 4 గంటల వరకు సుమారు 500 మందికి అన్నదానం చేసినట్లు పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా ప్రతి అదివారం సంతలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వ్యాపారాలు చేసుకునే వర్తకులు, రైతులకు మధ్యాహ్నం ఆకలితో పస్తులుండకూడదనే ఉద్దేశంతో తమ నాయకులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సంకల్పించారన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఆదివారం రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు సాంస్కృతిక జీవనానికి ప్రతీక సభా కథలు



మా కథలు-2022 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: చిత్తూరు జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రచయిత కె.సభా కథలు రచనా వ్యాసంగం చేశారని ప్రముఖ రచయిత మధురాంతకం నరేంద్ర అన్నారు. ఆదివారం సాయంత్రం బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కె.సభా సంస్మరణ సభ, మా కథలు–2022 కథ సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మధురాంతకం నరేంద్ర, భూమన్ పాల్గొన్నారు. ఆత్మీయ అతిథులుగా పలమనేరు బాలాజీ, కృష్ణస్వామి రాజు పాల్గొన్నారు. సాకం నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆకుల మల్లేశ్వరరావు, డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, తమటం రామచంద్రారెడ్డి, కలువగుంట రామమూర్తి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, యువశ్రీ మురళి, పల్లిపట్టు నాగరాజు, కాంతారావు, సురేంద్ర రొడ్డా పాల్గొన్నారు.

కమనీయం ఆదిదంపతుల కల్యాణం

- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- నేడు సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగనున్న స్వామివారు



స్వామి, అమ్మవారికి కల్యాణోత్సవం

చంద్రగిరి: స్వర్ణముఖీనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి(ముక్కోటి)వారి ఆలయంలో ఆదివారం రాత్రి పార్వతీ పరమేశ్వరులకు వైభవంగా కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం మూలమూర్తికి రుద్రాభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. తదుపరి శ్రీరామచంద్రమూర్తి, శ్రీవేణుగోపాల స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి, అలంకరణ చేశారు. అనంతరం సాయంత్రం దీపారాధన, కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి ఊంజల్‌సేవను నిర్వహించి, ప్రసాదాలు పంచిపెట్టారు. ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేటి కార్యక్రమాలు

ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై విహరించనున్నారు. తదుపరి కాలభైరవస్వామి, శ్రీమహాలక్ష్మీ దేవిలకు అభిషేకం, రాత్రి చంద్రప్రభ వాహనంపై ఉత్సవర్లు ఊరేగనున్నారు.